నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 31 మార్చి 2024 | KAMAREDDY

'పది'ంతల ఆనందం

నిజామాబాద్‌లో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు

పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18న పరీక్షలు ప్రారంభం కాగా చివరి పేపర్ సాంఘికశాస్త్రం శని వారం నిర్వహించారు. ఇన్నాళ్లూ పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు.. పరీక్షలు ముగియడంతో సంబురాల్లో మునిగితేలారు. ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లడంతో బస్టాండ్ల వద్ద రద్దీ నెల కొన్నది. వొకేషనల్ కోర్సు వారికి మాత్రం ఏప్రిల్ 2 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

నిజామాబాద్‌లో హాస్టల్ నుంచి ఇంటికి పయనమవుతున్న విద్యార్థిని

కామారెడ్డిలో పరీక్షలు ముగియడంతో ఆనందం వ్యక్తంచేస్తున్న విద్యార్థులు

ప్రారంభమైన కుస్తీ పోటీల సీజన్

కుస్తీమే సవాల్

కండబలం.. ఉడుంపట్టు.. నైపుణ్యం కలగలపిన ఆట కుస్తీ. ప్రత్యర్థిని మట్టి కరిపించేందుకు తొడగొట్టి సవాల్ చేస్తుంటారు. యువత కేరింతలు.. మావోడే గెలుస్తాడంటే.. మావోడే గెలుస్తాడంటూ పోటా పోటీ. కండలు తిరిగిన పహిల్వాన్ల క్రీడగా పేరొందిన కుస్తీ పోటీల సీజన్ ప్రారంభమైంది. ప్రతి వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. సంప్రదాయ పండుగల్లో నిర్వహించే ఈ కుస్తీ పోటీలపై ప్రత్యేక కథనం..

పల్లెల్లో తగ్గని ఆదరణ
గ్రామీణ ప్రాంతాల్లో పండుగ వాతావరణం
పోటీల్లో స్థానికులతోపాటు, మహారాష్ట్ర పహిల్వాన్లు
విజేతలకు నగదు, వెండి కడియాల బహూకరణ

గాంధారి, మార్చి 30: ప్రస్తుత సమాజంలో ఎన్నో ఆధునిక క్రీడలు పుటుకొచ్చినప్పటికీ, పల్లెల్లో కుస్తీ పోటీలకు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. తెలంగాణ సంప్రదాయానికి ప్రతిబింబంగా నిలుస్తున్న కుస్తీ పోటీలంటే పల్లె ప్రజలకు ఎంతో ఇష్టం. ఈ ఇష్టంతోనే ప్రతి సంవత్సరం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో కుస్తీ పోటీలను గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తుంటారు. కుస్తీ పోటీలు జరుగుతున్నాయంటే చాలు పండుగ వాతావరణం నెలకొంటుంది. కుస్తీ పోటీలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక మల్లయోధులతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి కుస్తీ పహిల్వాన్లు సైతం వస్తుంటారు. పల్లెల్లో నిర్వహించే కుస్తీ పోటీలు ఒకవైపు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుండగా, మరోవైపు కొందరికి ఉపాధిని కల్పిస్తున్నాయి.

కొబ్బరికాయ కుస్తీతో మొదలు..

గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే కుస్తీ పోటీలను డప్పుచప్పుళ్ల నడమ ఘనంగా ప్రారంభిస్తారు. మొదట చిన్న పిల్లలతో కొబ్బరికాయ కుస్తీని పట్టిస్తారు. మొదటి కుస్తీలో గెలిచిన విజేతకు నిర్వాహకులు కుంకుమ తిలకం పెట్టి కొబ్బరికాయను బహుమతిగా అందజేస్తారు. అనంతరం రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500ల కుస్తీలతోపాటు వెండి కడెం పోటీలను నిర్వహిస్తారు. ఈ కుస్తీ పోటీలను వివిధ దశల్లో నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనే మల్లయోధులు (పహిల్వాన్లు) తమ సమఉజ్జీలతో ఆయా విభాగాల్లో పోటీపడతారు. గెలిచిన వారికి నిర్వాహకులు, విభాగాల ఆధారంగా నగదు బహుమతులను అందజేస్తారు. కుస్తీ పోటీల్లో ప్రత్యేకమైనది చివరి కుస్తీ. ఇందులో పోటీపడి గెలిచిన వీరుడికి కుంకుమ బొట్టును పెట్టి, వెండి కడియాన్ని బహూకరిస్తారు. దీంతోపాటు పోటీలు రసవత్తరంగా సాగితే కొన్ని సందర్భాల్లో ఓడిపోయిన మల్లయోధుడికి సైతం నిర్వాహకులు బహుమతులను అందజేస్తారు. విజేతలకు దాదాపు రెండు తులాల వెండి కడెంతో మొదలుకొని 10 తులాల కడెం వరకు బహూకరిస్తారు.

పల్లెల్లో జాతర వాతావరణం...

గ్రామాల్లో కుస్తీ పోటీలు జరుగుతున్నాయంటే బంధువులతోపాటు, స్నేహితులను ఇండ్లకు ఆహ్వానిస్తుంటారు. కుస్తీ పోటీలు నిర్వహించే ప్రాంతమంతా పెద్ద సంఖ్యలో హాజరైన జనంతో కిక్కిరిసిపోతుంది. దీంతో జాతర వాతావరణం నెలకొంటుంది. ఉమ్మడి జిల్లాల్లోని చిన్నచిన్న పల్లెల్లోనే కాకుండా మండలస్థాయిలో సైతం కుస్తీ పోటీలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా బాన్సువాడ, గాంధారి, పిట్లం, బిచ్కుంద, లింగంపేట్, నిజాంసాగర్, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, తాడ్వాయి, నస్రుల్లాబాద్, బీర్కూర్, కోటగిరి, బోధన్, వర్ని, నవీపేట తదితర మండలాల్లో ఘనంగా నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన కుస్తీ పోటీలు..

ఉమ్మడి జిల్లాలో పల్లె ప్రజలు ఎంతో ఇష్టపడే కుస్తీ పోటీలు ప్రతి సంవత్సరం శివరాత్రి, హోలీ (రంగుల) పండుగలతో ప్రారంభమవుతాయి. వేసవి కాలం ప్రారంభం కావడంతో పల్లెల్లోని ప్రజలకు తీరిక దొరుకుతుంది. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆనవాయితీ ప్రకారం ఆయా గ్రామాల్లో జరుపుకొనే పండుగలతోపాటు కుస్తీ పోటీలను నిర్వహిస్తుంటారు.

కాంగ్రెస్ తప్పుడు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
కార్యకర్తలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల పిలుపు
24 గంటలపాటు ప్రజల్లోనే ఉంటా: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి
కాంగ్రెస్, బీజేపీకి తెలంగాణ ఆత్మలేదు : ఎంపీ సురేశ్ రెడ్డి

తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్/బాల్కొండ, మార్చి 30 : తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తోపాటు ఎంపీ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి వేల్పూర్, ఉమ్మడి బాల్కొండ మండలాల కార్యకర్తల సన్నాహక సమావేశాలను శనివారం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతోనే కాంగ్రెస్ గద్దెనెక్కిందని, దీంతో మూడునెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. రూ. 4వేల పెన్షన్, మహిళలందరికీ నెలకు రూ.2500, ఇందిరమ్మ ఇండ్లు, రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధుసాయం పెంపు, యువవికాస్ తదితర ఎన్నో హామీలిచ్చిన విషయాన్ని కార్యకర్తలకు ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. వందరోజుల్లో అమలు చేస్తామన్న ఒక్క హామీని కూడా ప్రజలకు అందజేయలేదన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు అడగాలని సూచించారు. రేవంత్‌రెడ్డి కమీషన్లు దండుకొని కాంగ్రెస్ పెద్దలకు డబ్బులు పంపడం తప్ప.. రైతు, ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీ అర్వింద్ ఐదేండ్లలో ఒక్క గ్రామాన్ని కూడా సందర్శించలేదని, పల్లెల అభివృద్ధికి రూపాయి కూడా మంజూరు చేయలేదని గుర్తుచేశారు. తప్పుడు బాండ్ పేపర్‌తో రైతుల ఓట్లు దండుకున్న ఆయన.. పసుపు బోర్డును ఎక్కడికి తెచ్చాడని ప్రశ్నించారు. వేల్పూర్, బాల్కొండలో ర్యాలీలో పాల్గొని ప్రచారం నిర్వహించారు. బాల్కొండలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

తెలంగాణ కోసం నిలబడుతాం: -ఎంపీ సురేశ్‌రెడ్డి

రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం చాలా అవసరమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తెలంగాణ ఆత్మ లేదన్నారు. పార్టీలు మారే వారు మారుతారని, తాము మాత్రం తెలంగాణ కోసం నిక్కచ్చిగా నిలబడుతామని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో పసుపు బోర్డుపై తాను ప్రశ్నిస్తే.. ఏర్పాటు చేయబోమని సమాధానం ఇచ్చారని సురేశ్‌రెడ్డి గుర్తుచేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు

కాంగ్రెస్ బుడ్డర్‌ఖాన్ మాటలను నమ్మొద్దు..

కాంగ్రెస్ పార్టీ బుడ్డర్‌ఖాన్ మాటలను నమ్మవద్దని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న.. ఓడ దిగిన తర్వాత బోడి మల్లన్న అన్నట్లు రేవంత్ తీరు ఉన్నదని విమర్శించారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ, రైతుభరోసా అని మాయ మాటలు చెప్పి, ఇప్పుడు సీఎం అయ్యాక రైతుల దిక్కు కూడా చూడకుండా ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నాడని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు ఇస్తామన్న తులం బంగారం ఎక్కడ..? రూ.2 లక్షల రుణమాఫీ ఎక్కడ? వడ్లకు రూ.500 బోనస్ ఎక్కడ? అని ప్రశ్నించారు. బోర్లు ఎత్తిపోయి, పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతుంటే పట్టించుకునే వారే లేరన్నారు. ఎంపీ అర్వింద్ సోషల్ మీడియాలో అబద్ధాలు ప్రచారం చేయడం తప్ప జిల్లాకు చేసింది శూన్యమని విమర్శించారు. ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు.. ఐదేండ్లు గడిచినా రాలేదని, ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తాడని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నిలదీయాలని, హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించాలని కోరారు.

బాల్కొండలో ఇఫ్తారు విందులో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్ఎస్ నేత వీజీగౌడ్

వేల్పూర్‌లో ప్రచారం చేస్తున్న బాజిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

జల్సాల కోసం బైక్‌ల చోరీ

పల్సర్ బైక్‌లే టార్గెట్..
ఇద్దరి అరెస్టు
26 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నిందితుల నుంచి స్వాధీనం చేస్తున్న ద్విచక్ర వాహనాలు

నస్రుల్లాబాద్, మార్చి 30: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ అయాజ్ ఖాన్, మహమ్మద్ సమీరుద్దీన్ శనివారం ఉదయం బీర్కూర్ మండల కేంద్రంలోని కమాన్ వద్ద నంబరు ప్లేటు లేని పల్సర్ బైక్‌పై వస్తూ అక్కడే పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని పట్టుకొని విచారించగా ఆరు నెలలుగా మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, సదాశివనగర్, గాంధారి, భిక్కనూర్, నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్, ఇందల్వాయి, సంగారెడ్డి జిల్లా పెద్ద శంకరంపేట్, కల్హేర్, ఇతర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇండ్లముందు పార్కింగ్ చేసిన బైక్‌లను రాత్రివేళలో దొంగిలించేవారు. వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. బీర్కూర్‌లో ఉదయం 5గంటలకు బైక్‌ను దొంగిలించేందుకు రాగా పోలీసులు పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలో దొంగిలించిన మొత్తం 26 బైక్‌లను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల్లో ఇద్దరు యువకులు, ఒక మైనర్ ఉన్నట్లు వివరించారు. కేసును ఛేదించిన బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణగౌడ్, బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, పిట్లం ఎస్సై నరేశ్, సిబ్బంది వస్సీ, రఘు, సాయిబాబ, శివచరణ్, సంగమేశ్వర్, అశోక్‌ను అభినందించారు.

నగరంలో రూ.4లక్షల నగదు సీజ్

వినాయక్‌నగర్, మార్చి 30: నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో రూ. 4లక్షల 8వేల 910 నగదును సీజ్ చేశామని ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కుమార్‌గల్లీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా శివప్రసాద్ అనే వ్యక్తి ఆధారాలు లేకుండా డబ్బు తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు.

అవిశ్వాసం

• మాక్లూర్‌లో వీగింది..

మాక్లూర్, మార్చి 30: మాక్లూర్ ఎంపీపీ మాస్త ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుక్కి సుజాతపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం కోరం లేకపోవడంతో వీగిపోయింది. మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో రాజేంద్రకుమార్ అధ్యక్షతన శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 14మంది సభ్యుల్లో అవిశ్వాసానికి తొమ్మిది మంది ఎంపీటీసీలు హాజరుకావాల్సి ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు గోపూరి ఒడ్డెన్న, కాలగడ్డ గంగామణి, పురుషోత్తం రావు, మంథని సత్యనారాయణ, బొంతల లలిత, తౌడు పెద్దులు, వెంకటేశ్వర్‌రావు, బీజేపీ చెందిన కోటగిరి లక్ష్మి మాత్రమే హాజరయ్యారు. రిజిష్టర్‌లో సంతకాలు పెట్టాలని ఆర్డీవో కోరగా సంతకాలు చేయకుండానే వెనుదిరిగారు. కోరానికి మరో ఎంపీటీసీ సభ్యుడు లేకపోడవంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆర్డీవో రాజేంద్రకుమార్ ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా న్యాయమే గెలిచిందని, బీఆర్ఎస్‌కు ప్రజలు అండగా ఉన్నారని ఎంపీపీ మాస్త ప్రభాకర్ అన్నారు.

అవిశ్వాసం వీగిపోవడంతో విజయ సంకేతం చూపుతున్న బీఆర్ఎస్ ఎంపీటీసీలు

• కామారెడ్డి, డిచ్‌పల్లిలో నెగ్గింది..

కామారెడ్డి, మార్చి 30: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో బలనిరూపణ పరీక్ష నిర్వహించారు. మొత్తం 49మంది కౌన్సిలర్లు ఉన్న కౌన్సిల్లో అవిశ్వాసం నెగ్గడానికి 34మంది సభ్యులు అవసరం కాగా, అవిశ్వాసానికి కాంగ్రెస్ నుంచి 27 మంది, బీఆర్ఎస్ నుంచి 10మంది కౌన్సిలర్లు మొత్తం 37మంది మద్దతు తెలిపారు. దీంతో నిట్టు జాహ్నవి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కోల్పోయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జగరకుండా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి, మార్చి 30: డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మేరకు ఆర్డీవో రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో శనివారం బలపరీక్ష నిర్వహించారు. మొత్తం 17 మంది ఎంపీటీసీలు ఉండగా, అవిశ్వాసానికి అనుకూలంగా 13 మంది చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. సమావేశానికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, తదుపరి ఆదేశాలు వచ్చాక ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నిక నిర్వహిస్తామని చెప్పారు.